

పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ విజయారెడ్డి, అధికారులు

బాక్స్ డ్రెయిన్ పనులను పరిశీలించిన కార్పొరేటర్

ఖైరతాబాద్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): ఓల్డ్ సీఐబీ క్వార్టర్స్‌లో జరుగుతున్న బాక్స్ డ్రెయిన్ పనులను శుక్రవారం కార్పొరేటర్ విజయారెడ్డి జీహెచ్‌ఎంసీ అధికారులతో కలిసి పరిశీలించారు. ఇప్పటికే ఓ వీధికి చెందిన పనులు పూర్తి కాగా.. ముద్రణాలయం వైపు వర్షపు నీరు సాఫీగా వెళ్లేలా చేపడుతున్న మరో వీధికి చెందిన పనులు రెండు రోజుల క్రితం ప్రారంభమయ్యాయి. పనులు జరుగుతున్న క్రమంలో ప్రభుత్వ ముద్రణాలయానికి చెందిన వాహనాల పార్కింగ్ ప్రాంతం దెబ్బతినడం, పైప్‌లైన్ కోసం తీసిన తీసిన మట్టిని చదునుచేయకపోవడంపై ముద్రణాలయ అధికారులు ఫిర్యాదు చేశారు. అధికారులతో మాట్లాడిన విజయారెడ్డి సమస్యను పరిష్కరించాలని సూచించారు. పనులను త్వరితగతిన పూర్తి చేసి వచ్చే వర్షాకాలంలో ముంపు సమస్య తలెత్తకుండా చూడాలన్నారు. జీహెచ్‌ఎంసీ డీఈ చైతన్య, ఏఈ చరణ్, ముద్రణాలయ జేఏసీ నాయకులు ఈశ్వర్‌రావు, బాల్‌కుమార్ పాల్గొన్నారు.

పంజాగుట్ట పీఎస్‌ను సందర్శించిన డీసీపీ

పంజాగుట్ట, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): పశ్చిమ మండలం డీసీపీ విజయ్‌కుమార్ శుక్రవారం పంజాగుట్ట పోలీస్‌స్టేషన్‌ను సందర్శించారు. పోలీస్ స్టేషన్ ఆవరణలో ఉన్న వివిధ కేసులలో స్వాధీనం చేసుకున్న వాహనాలను పరిశీలించి వివరాలను తెలుసుకున్నారు. అనంతరం ఇటీవల సంచలనం సృష్టించిన ప్రముఖ వ్యాపారవేత్త వెలమాటి చంద్రశేఖర జనార్దన్‌రావు హత్య కేసు, సిద్దిపేటకు చెందిన చక్రధర్ గౌడ్ ఫోన్ ట్యాపింగ్ కేసు, ఇతర కేసుల వివరాలను అక్కడి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. కేసులకు సంబంధించి ఆయన పలు సూచనలు చేశారు.

నగల దుకాణంలో బ్రేస్‌లెట్‌లు మాయం.. కేసు నమోదు

బంజారాహిల్స్, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): నగల దుకాణంలో బ్రేస్‌లెట్‌లు మాయమైన ఘటన జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. జూబ్లీహిల్స్ రోడ్డు నంబర్ 45లోని ఓ షోపులో ఈ నెల 19న ఆడిటింగ్ జరిగింది. ఇందులో 4.18 గ్రాముల విలువ చేసే రెండు బ్రేస్‌లెట్‌ల వివరాలు లభించలేదు. ఎంత వెతికినా ప్రయోజనం లేకపోవడంతో స్టోర్ మేనేజర్ తిప్పన విజయ్ జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. చిన్న పిల్లలకు సంబంధించిన వస్తువులు కొనుగోలు చేసేందుకు వచ్చిన ఇద్దరు అగంతకులు అరగంట పాటు షోరూంలో ఉన్నారని, వారిపై అనుమానంగా ఉందని స్టోర్ మేనేజర్ ఫిర్యాదులో పేర్కొన్నాడు.

ట్రాఫిక్ పోలీసులను దుర్భాషలాడిన వ్యక్తిపై కేసు

బంజారాహిల్స్, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): రాంగ్ రూట్లో వెళ్తున్న వాహనాన్ని అడ్డుకున్న పోలీసులను దుర్భాషలాడిన వ్యక్తిపై కేసు నమోదైంది. యాదాద్రి జిల్లాకు చెందిన వి.అశోక్ జూబ్లీహిల్స్ ట్రాఫిక్ పోలీసు స్టేషన్‌లో ఆర్ ఎస్‌ఐగా పనిచేస్తున్నాడు. ఈ నెల 20 జూబ్లీహిల్స్ నీరూస్ చౌరస్తాలో కానిస్టేబుల్ సోమేశ్వర్‌తో కలిసి విధులు నిర్వహిస్తున్నాడు. ఆ సమయంలో ఓ వ్యక్తి ద్విచక్రవాహనంపై రాంగ్‌రూట్‌లో వస్తుండటం గమనించి అడ్డుకోవడంతో వాహనంపై ఉన్న వ్యక్తి దుర్భాషలాడాడు. దీంతో అతడిని అదుపులోకి తీసుకుని జూబ్లీహిల్స్ శాంతిభద్రతల విభాగం పోలీసులకు అప్పగించారు.

మహిళ అదృశ్యం



కవిత

ఖైరతాబాద్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): మహిళ అదృశ్యమైన ఘటన ఖైరతాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. వికారాబాద్ జిల్లాకు చెందిన చాకలి లక్ష్మయ్య, కవిత(27) భార్యాభర్తలు. వీరు 3 నెలల క్రితం నగరానికి వచ్చి ఎర్రమంజిల్‌లోని ఓ అపార్ట్‌మెంట్‌లో వాచ్‌మెన్‌గా, పనిమనిషిగా పని చేస్తున్నారు. ఈ నెల 15న లక్ష్మయ్య స్థానిక పాఠశాలలో చదువుతున్న కుమార్తెను తీసుకొచ్చేందుకు వెళ్లి తిరిగిరాగా కవిత కనిపించలేదు. ఎంత వెతికినా ప్రయోజనం లేకపోవడంతో లక్ష్మయ్య ఖైరతాబాద్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకొని పోలీసులు విచారిస్తున్నారు.

చైన్ స్నాచర్ అరెస్ట్

పంజాగుట్ట, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): మహిళ మెడలో నుంచి బంగారు గొలుసు అపహరించిన ఘటనలో పంజాగుట్ట పోలీసులు చైన్ స్నాచర్‌తో పాటు రిసీవర్‌ను అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి 12 గ్రాముల బంగారు గొలుసు, ద్విచక్రవాహనం, రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బేగంపేట కుందన్‌బాగ్‌కు చెందిన జి.వరలక్ష్మి ఓ వ్యాపార సముదాయంలో హౌస్ కీపింగ్ విభాగంలో పనిచేస్తోంది. ఈ నెల 19న ఉదయం విధులకు వెళ్తుండగా వెనుక నుంచి ద్విచక్రవాహనంపై వచ్చిన అగంతకుడు ఆమె మెడలో ఉన్న 12 గ్రాముల బంగారు గొలుసును లాక్కొని పారిపోయాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పంజాగుట్ట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సీసీ ఫుటేజీ, సాంకేతిక ఆధారాలతో అబిడ్స్ రాంకోఠి ప్రాంతానికి చెందిన కాల్ సెంటర్ ఉద్యోగి అయిన చైన్‌స్నాచర్ మాథ్యూరాజ్ జాసన్(22)తో పాటు చంపాపేటకు చెందిన నగల దుకాణం నిర్వాహకుడు కవాడియా అన్‌రాజ్ ప్రజాపథ్(40)ను శుక్రవారం అరెస్టు చేశారు.

అదుపుతప్పిన బైక్.. వ్యక్తి మృతి

అబ్దుల్లాపూర్‌మెట్, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): ద్విచక్రవాహనం అదుపు తప్పడంతో కిందపడిన వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందిన సంఘటన అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. హయత్‌నగర్ భగత్‌సింగ్ కాలనీకి చెందిన సద్గుణ శేఖర్(26) డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. శుక్రవారం ఉదయం ద్విచక్రవాహనంపై ఇబ్రహీంపట్నం మండలంలోని పోల్కంపల్లి గ్రామానికి వెళ్లాడు. పని ముగించుకుని సాయంత్రం తిరిగి హయత్‌నగర్‌కు వస్తున్నాడు. అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని సంఘినగర్ వద్దకు రాగానే బైక్ అదుపుతప్పడంతో శేఖర్ కిందపడ్డాడు. ఈ ప్రమాదంలో సద్గుణ శేఖర్ తలకు బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

రైలు నుంచి జారిపడి వ్యక్తి మృతి



సికింద్రాబాద్ రైల్వేస్టేషన్, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): రైలులో ప్రయాణిస్తున్న ఓ వ్యక్తి ప్రమాదశాత్తు జారిపడి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటన మౌలాలి రైల్వేస్టేషన్ సమీపంలో జరిగింది. సికింద్రాబాద్ రైల్వే హెడ్ కానిస్టేబుల్ డేవిడ్ రాజు తెలిపిన వివరాల ప్రకారం.. మౌలాలి రైల్వే స్టేషన్ బీ క్యాబిన్ వద్ద గుర్తుతెలియని వ్యక్తి(45) శుక్రవారం సికింద్రాబాద్ వెళ్లే ఎక్స్‌ప్రెస్ రైలులో ప్రయాణిస్తుండగా ప్రమాదవశాత్తు కింద పడడంతో రెండు కాళ్లు కోల్పోయి తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు. వ్యక్తి ఆచూకీ తెలిస్తే 9440083160 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని రైల్వే పోలీసులు కోరారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి అదృశ్యం

కవాడిగూడ, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి అదృశ్యమైన ఘటన దోమలగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. దోమలగూడ ఎస్‌ఐ శ్రీనివాస్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. దోమలగూడలో నివాసం ఉండే జితేందర్ దేశ్వాని(53) ఆర్థిక ఇబ్బందులతో ఇంట్లో ఎవరికి చెప్పకుండా ఈ నెల 19న తేదీ బయటకు వెళ్లాడు. ఎంతకీ తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు చుట్టు పక్క ప్రాంతాలు, బంధువులు, స్నేహితుల ఇళ్లలో వెతికారు. ఆయన ఆచూకీ లభించకపోవడంతో దోమలగూడ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్‌ఐ శ్రీనివాస్ రెడ్డి మిస్సింగ్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. ఆచూకీ తెలిసిన వారు దోమలగూడ పోలీస్‌స్టేషన్ లేదా 9849563715 నంబర్‌లో సమాచారం అందిచాలని కోరారు.

పన్ను చెల్లించాల్సిందే!

- మొండి బకాయిదారులపై అధికారుల దృష్టి
- ఏళ్ల తరబడి పన్ను చెల్లించని బడాబాబులు
- ఆస్తులు సీజ్ చేస్తున్న అధికారులు
- దిగొస్తున్న యజమానులు



జీహెచ్‌ఎంసీ ఖైరతాబాద్ కార్యాలయం

ఖైరతాబాద్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): ఆస్తి పన్ను చెల్లించని బడాబాబులపై దృష్టి సారిస్తున్న జీహెచ్‌ఎంసీ అధికారులు వారి ఆస్తులను సీజ్ చేసేందుకు సైతం వెనుకాడడం లేదు. బకాయిలపై విధించిన వడ్డీపై 90 శాతం రాయితీ ఇచ్చినప్పటికీ గత మూడు, నాలుగేళ్ల నుంచి పన్ను కట్టని యజమానులపై అధికారులు దృష్టి సారించారు. ఇందులో భాగంగా గత 4 రోజులుగా సర్కిల్ 18 అధికారులు దూకుడు పెంచి ఆస్తులను సీజ్ చేస్తుండడంతో తప్పని పరిస్థితుల్లో యజమానులు దిగివస్తున్నారు. బంజారాహిల్స్ రోడ్డు నంబరు 10లో ఉన్న ఓ హోటల్ భవనం యజమాని గత ఆరేళ్లుగా ఆస్తిపన్ను చెల్లించడం లేదు. దీంతో భవనంలో నడుస్తున్న బ్యాంకు, హోటల్‌ను అధికారులు సీజ్ చేశారు. దీంతో యజమాని స్పందించి వెంటనే సగం పన్ను బకాయిలను అక్కడికక్కడే చెల్లించి మిగతాది కొద్ది రోజుల్లో చెల్లిస్తానని హామీ ఇచ్చాడు. దీంతో పాటు బంజారాహిల్స్ రోడ్డు నంబర్ 1లోని ఓ హోటల్ యజమాని కోటి రూపాయలకు పైగా బకాయి పడగా హోటల్‌ను సీజ్ చేసేందుకు అధికారులు వెళ్లారు. దీంతో యజమాని వెంటనే కొంత పన్ను చెల్లించి మిగతాది మార్చి 31లోపు చెల్లిస్తానని హామీ ఇచ్చాడు. ఇక మీదట ఇలాగే కఠినంగా వ్యవహరిస్తామని, మొండి బకాయిదారులను వదిలేది లేదని అధికారులు స్పష్టం చేస్తున్నారు.

జంట సర్కిళ్లలో ఇదీ పరిస్థితి..

జంట సర్కిళ్లయిన ఖైరతాబాద్ (17), జూబ్లీహిల్స్(18)లలో ఆస్తిపన్ను చెల్లించని యజమానులకు జీహెచ్‌ఎంసీ రెండు పర్యాయాలు నోటీసులు అందజేసింది. మొదట డిమాండ్ నోటీసులను జారీ చేయగా వాటికి స్పందించని వారికి ఆస్తులు సీజ్ చేస్తామంటూ రెడ్ నోటీసులను వారెంట్ల రూపంలో పంపించారు. ఖైరతాబాద్ సర్కిల్‌లో మొత్తం 66,620 ఆస్తులు ఉండగా, అందులో 47,809 మంది యజమానులు పన్ను చెల్లించారు. మిగతా వారికి డిమాండ్ నోటీసులను జారీ చేయగా పెద్ద మొత్తంలో పన్ను చెల్లించే 800 మందిని గుర్తించి రెడ్ నోటీసులను జారీ చేశారు. ఈ సర్కిల్‌లో 2024-25 ఆర్థిక సంవత్సరానికి గాను రూ.203 కోట్ల పన్ను వసూళ్ల లక్ష్యం ఉండగా.. ఇప్పటి వరకు రూ.110 కోట్ల వరకు వసూలు చేశారు. గత సంవత్సరం ఇక్కడ రూ.160 కోట్లను పన్ను రూపంలో వసూలు చేశారు. ఇక జూబ్లీహిల్స్ సర్కిల్‌లో రూ.231 కోట్ల పన్ను వసూళ్ల లక్ష్యం ఉండగా.. ఇప్పటి వరకు రూ.143.79 కోట్లను వసూలు చేశారు. ఈ సర్కిల్ పరిధిలో గత ఏడాది రూ.183 కోట్లు వసూలు చేశారు. జూబ్లీహిల్స్ సర్కిల్‌లో పన్ను చెల్లించాల్సిన మొత్తం ఆస్తులు 65,838 ఉండగా.. ఇప్పటి వరకు 44,256 మందికి డిమాండ్ నోటీసులు జారీ చేశారు. మొండి బకాయిదారులుగా గుర్తించిన 2,940 మందికి వారెంట్లను జారీ చేసి పన్ను కట్టేలా వారిపై ఒత్తిడి తీసుకువస్తున్నారు. ఆర్థిక సంవత్సరం ముగిసే మార్చి 31 నాటికి బకాయిపడ్డ వారంతా పన్ను కట్టేలా రోజువారీ టార్గెట్లతో బిల్ కలెక్టర్లు, టాక్స్ ఇన్‌స్పెక్టర్లతో పాటు అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్లు, ఉప కమిషనర్లు సైతం క్షేత్రస్థాయికి వెళ్లి ఒత్తిడి తెస్తున్నారు. పన్ను బకాయిదారుల్లో ప్రభుత్వ రంగ సంస్థలు సైతం ఉండడంతో ఆయా సంస్థల అధికారులతో చర్చలు జరుపుతున్నారు. కొన్ని స్టార్ హోటళ్ల యజమానులు, బడా పారిశ్రామిక వేత్తలు, షాపింగ్ మాల్స్, హాస్టల్ భవనాల యజమానులు పన్ను చెల్లించకపోవడంతో వారిపై అధికారులు దృష్టి సారించారు. ఇక నివాస గృహాల వారు సైతం చాలా మంది పన్ను చెల్లించాల్సి ఉందని, మార్చిలోగా పన్ను చెల్లించి నగర అభివృద్ధిలో భాగస్వాములు కావాలని జీహెచ్‌ఎంసీ అధికారులు కోరుతున్నారు.

కఠిన చర్యలు తీసుకుంటాం



ప్రతి ఒక్కరూ పన్ను చెల్లించి అభివృద్ధిలో భాగస్వాములు కావాలి. ఆస్తులను లీజుకు ఇచ్చి ప్రతినెలా ఆదాయం పొందుతూ చాలా మంది పన్ను చెల్లించడం లేదు. అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. పెద్ద మొత్తంలో బకాయిలు ఉన్నవారు విడతల వారీగా పన్ను కట్టాలని కోరినా స్పందించకపోవడంతో వారి ఆస్తులు సీజ్ చేస్తున్నాం. జీహెచ్‌ఎంసీ కస్టమర్ సర్వీస్ సెంటర్లలో లేదా బిల్ కలెక్టర్లకు, ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్లకు, మీ సేవ కేంద్రాల్లో, ఆన్‌లైన్‌లో పన్ను చెల్లించవచ్చు.

- ప్రశాంతి, డిప్యూటీ కమిషనర్, సర్కిల్ 18

కాంగ్రెస్ పార్టీ మోసం చేసింది

- మేనిఫెస్టో అమలు చేస్తామంటేనే ఎమ్మెల్సీ ఎన్నికల నుంచి తప్పుకున్నా
- మాజీ డీఎస్పీ గంగాధర్
- ఇప్పుడు పట్టించుకోవడం లేదని ఆవేదన



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ డీఎస్పీ గంగాధర్

పంజాగుట్ట, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు సేవ చేయాలనే ఉద్దేశంతో పోలీస్ ఉద్యోగాన్ని వదులుకుని కరీంనగర్, మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్ పట్టభద్రుల నియోజకవర్గం ఎమ్మెల్సీ ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా బరిలో ఉన్న తనను కాంగ్రెస్ పార్టీ మోసం చేసిందని మాజీ డీఎస్పీ ఎం.గంగాధర్ ఆరోపించారు. శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వివిధ సంఘాల నాయకులు పోకల కిరణ్‌కుమార్ మాదిగ, దయానంద్ తదితరులతో కలిసి ఆయన మాట్లాడారు. పార్టీ నిలబెట్టిన అభ్యర్థికి మద్ధతు ఇస్తే తన మేనిఫెస్టోను అమలుచేస్తామని కాంగ్రెస్ నేతలు చెప్పడంతో తన నామినేషన్ ఉపసంహరించుకున్నానని ఆయన పేర్కొన్నారు. మంత్రి శ్రీధర్‌బాబు, మాజీ ఎంపీ వి.హనుమంతరావు, ఎమ్మెల్యే కె.సత్యనారాయణ తనను పిలిపించుకుని నామినేషన్ ఉపసంహరించుకునేలా చేశారన్నారు. అయితే ఇప్పుడు తనను పట్టించుకోవడం లేదని ఆయన విమర్శించారు. పోకల కిరణ్ కుమార్ మాదిగ, దయానంద్ మాట్లాడుతూ.. చిన్నతనం నుంచి గంగాధర్ పేదరికం అనుభవించారని, కష్టపడి పోలీస్ శాఖలో డీఎస్పీ స్థాయికి ఎదిగారన్నారు. పోలీస్ శాఖలో ఎలాంటి మచ్చ లేకుండా విధులు నిర్వర్తించారని కొనియాడారు. అలాంటి వ్యక్తి ప్రజలకు సేవ చేయాలని ఆలోచిస్తే కాంగ్రెస్ పార్టీ నేతలు మోసం చేయడం దారుణమన్నారు. గంగాధర్ రూపొందించిన మేనిఫెస్టో అమలుపై కాంగ్రెస్ పార్టీ నేతలు స్పష్టమైన హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు.

విద్యకు 20శాతం నిధులు కేటాయించాలి

- రాష్ట్ర ప్రభుతాన్ని కోరిన ప్రొ. జగ్‌మోహన్ సింగ్
- కేంద్ర బడ్జెట్‌లో తక్కువ నిధులు కేటాయించడంపై అసంతృప్తి



సమావేశంలో మాట్లాడుతున్న ప్రొ. జగ్‌మోహన్ సింగ్

పంజాగుట్ట, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం గత పదేళ్లుగా విద్యా రంగానికి తక్కువ నిధులు కేటాయిస్తోందని పలువురు వక్తలు అన్నారు. ఇలా అయితే అందరికీ విద్య ఎలా అందుతుందని వారు ప్రశ్నించారు. శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో అఖిల భారత విద్యా హక్కు వేదిక అధ్యక్షుడు ప్రొఫెసర్ జగ్‌మోహన్ సింగ్, తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటీ అధ్యక్షుడు ప్రొఫెసర్ కె.చక్రధర్ రావు, ప్రధాన కార్యదర్శి ప్రొఫెసర్ జి.హరగోపాల్, ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రొ.జగ్‌మోహన్ సింగ్ మాట్లాడుతూ.. రాష్ట్ర బడ్జెట్లో విద్యకు 20 శాతం నిధులు కేటాయించాలని, విశ్వవిద్యాలయాల స్వయం ప్రతిపత్తిని కాపాడాలని వారు డిమాండ్ చేశారు. యూజీసీ మార్గదర్శకాల ప్రకారం విశ్వవిద్యాలయాల్లో వైస్ ఛాన్సలర్లను యూజీసీ, గవర్నర్ ప్రతినిధులే నియమిస్తారని, రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధులకు స్థానం లేకపోవడంతో రాష్ట్రాల హక్కులు దెబ్బతింటాయన్నారు. రాష్ట్రంలో విద్యకు తగిన ప్రాధాన్యత కల్పిస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ నేతలు గత పాలకుల మాదిరిగానే వ్యవహరిస్తున్నారని విమర్శించారు. 2024-25 బడ్జెట్లో విద్యకు కేవలం 7.3 శాతం నిధులు కేటాయించారని.. ఇప్పటికైనా విద్య ప్రాధాన్యతను గుర్తించి రాష్ట్ర బడ్జెట్లో కనీసం 20 శాతం నిధులు కేటాయించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఆ నిధులను ప్రభుత్వ విద్యా సంస్థల అభివృద్ధికి మాత్రమే ఖర్చు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో వివిధ సంఘాల నాయకులు ప్రదీప్, కిష్టప్ప, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

28న ఢిల్లీలో జాతీయ సదస్సు



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ (ఎంఎల్) మాస్ లైన్ కేంద్ర పొలిట్ బ్యూరో సభ్యుడు రాంచందర్

నల్లకుంట, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ సబ్‌కా సాత్, సబ్‌కా వికాస్ అని ప్రగల్భాలు పలికి పదేళ్ల పాలనలో అది కార్పొరేట్ కా సాత్, కార్పొరేట్ కా వికాస్‌గా ఉందని సీపీఐ (ఎంఎల్) మాస్ లైన్ నేతలు ఆరోపించారు. శుక్రవారం విద్యానగర్‌లోని మాస్ లైన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో సీపీఐ (ఎంఎల్) మాస్ లైన్ కేంద్ర పొలిట్ బ్యూరో సభ్యులు కె.జి.రాంచందర్, మాస్ లైన్ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.రమ, ఎస్.ఎల్.పద్మ, ఎం.హన్మేష్, సదానందం మాట్లాడారు. ఆర్‌ఎస్‌ఎస్, బీజేపీ ఫాసిస్టు, కార్పొరేట్, మతోన్మాద విధానాలకు వ్యతిరేకంగా ప్రజాస్వామ్యం, లౌకికవాదం, ఫెడరలిజం కోసం పోరాడాలని కోరుతూ ఈ నెల 28న ఢిల్లీలో జాతీయ సదస్సు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ జాతీయ సదస్సును విజయవంతం చేయాలని కోరుతూ మాస్ లైన్ విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు.

ఎస్సీ వర్గీకరణను అడ్డుకోవాలి: గవ్వల శ్రీకాంత్



సమావేశంలో పాల్గొన్న వడ్లమూరి కృష్ణ స్వరూప్ తదితరులు

కవాడిగూడ, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ సర్కార్ చేపట్టిన ఎస్సీ వర్గీకరణను జాతీయ ఎస్సీ కమిషన్ అడ్డుకోవాలని, వర్గీకరణతో నేతకాని, మహర్ కులాలకు తీవ్రంగా నష్టం జరుగుతుందని తెలంగాణ రాష్ట్ర నేతకాని, మహర్ కుల సంఘాల అధ్యక్షుడు గవ్వల శ్రీకాంత్ అన్నారు. ఈ మేరకు జాతీయ ఎస్సీ కమిషన్ చైర్మన్‌కు వినతిపత్రం అందించామని ఆయన పేర్కొన్నారు. మాలమహానాడు జాతీయ కమిటీ గౌరవ అధ్యక్షుడు సుప్రీంకోర్టు న్యాయవాది వడ్లమూరి కృష్ణ స్వరూప్‌తో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 338 క్లాస్ 9 ప్రకారం జాతీయ ఎస్సీ కమిషన్‌ను సంప్రదించకుండా తెలంగాణలో వర్గీకరణ పేరుతో మాదిగ కులాలకు ఎక్కువ రిజర్వేషన్ అవకాశాలు కల్పించి ఓటు బ్యాంకు రాజకీయాలకు కాంగ్రెస్ పాల్పడుతుందన్నారు. తెలంగాణలో ఎస్సీ జాబితాలోని మెజారిటీ జనాభా కలిగిన 26 కులాలకు అన్యాయం చేసే విధంగా వర్గీకరణ ప్రక్రియ ఉందని.. దీనికి సబంధించిన బిల్లు, చట్టంపై కోర్టుల్లో సవాల్ చేస్తామని ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు జేఎస్ రావు, దళిత బహుజన పార్టీ డీబీపీ గ్రేటర్ అధ్యక్షుడు మద్దెల ప్రవీణ్ కుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్ చిప్పరి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.



మనూ అంతర్జాతీయ సదస్సులో అడ్వాన్సెస్ ఇన్ అప్లైడ్ ఫిజిక్స్ సదస్సు బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న అతిథులు

'అడ్వాన్స్‌డ్ ఫిజిక్స్'తో అనేక సమస్యలకు పరిష్కారం

- ప్రొఫెసర్ ఎస్ఏ హష్మీ

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): నిజ జీవితంలో అడ్వాన్స్‌డ్ అప్లయిడ్ ఫిజిక్స్‌ను వినియోగించి అనేక సమస్యలకు పరిష్కారాలు చూపవచ్చని ఢిల్లీ యూనివర్సిటీ డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫిజిక్స్ అండ్ ఆస్ట్రో ఫిజిక్స్ ప్రొఫెసర్ ఎస్ఏ హష్మీ అన్నారు. మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీలో నిర్వహించిన అడ్వాన్సెస్ ఇన్ అప్లయిడ్ ఫిజిక్స్ అంతర్జాతీయ సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అప్లయిడ్ ఫిజిక్స్‌పై పరిశోధన ఫలితాలను యూనివర్సిటీలు పరస్పరం ఇచ్చి పుచ్చుకోవాలన్నారు. దీనికోసం మౌలానా యూనివర్సిటీ వేదికను ఏర్పాటు చేయడం మంచి విషయమన్నారు. ఈ సదస్సులో మనూ ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ పీఎఫ్ రహమాన్, ప్రొఫెసర్ మహ్మద్ రఫీక్ అబుతాలిబ్, ప్రొఫెసర్ అలీమ్ హెచ్ భాషా, డాక్టర్ మహ్మద్ సిద్దిఖీ పాల్గొన్నారు.

మతిస్థిమితం లేని మహిళ కిడ్నాప్

- స్కూటీపై ఎక్కించుకుని బలవంతంగా తీసుకెళ్లిన దుండగులు
- బాధితురాలిని బొల్లారంలో గుర్తించిన పోలీసులు
- నిందితులు పోలీసుల అదుపులో ఉన్నట్లు సమాచారం

మియాపూర్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): రోడ్డుపై నిల్చొన్న మతిస్థిమితం లేని మహిళను స్కూటీపై ఇద్దరు వ్యక్తులు బలవంతంగా ఎత్తుకెళ్లిన సంఘటన మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. మియాపూర్ బొల్లారం క్రాస్ రోడ్డులో బస్‌స్టాప్ వద్ద ఓ మహిళ (38) శుక్రవారం వేకువజామున 2 గంటల సమయంలో నిలబడి ఉంది. ఇద్దరు వ్యక్తులు ద్విచక్రవాహనంపై వచ్చి బలవంతంగా ఆమెను ఎక్కించుకొని బొల్లారం వైపు తీసుకెళ్లారు. మహిళను స్కూటీపై బలవంతంగా తీసుకెళ్తుండగా అక్కడ ఉన్న ఆటో డ్రైవర్ చూసి 100కు ఫోన్ చేసి సమాచారం అందించాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని అక్కడ సీసీ ఫుటేజీలను పరిశీలించగా ఇద్దరు వ్యక్తులు మహిళను బ్లూ కలర్ స్కూటీపై తీసుకెళ్లినట్లు గుర్తించారు. పోలీసులు రెండు బృందలుగా ఏర్పడి వారి కోసం గాలించారు. ఆ మహిళ బొల్లారంలో రోడ్డుపై తిరుగుతుండగా పోలీసులు ఆమెను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. మహిళ పేరు, నివాసం, ఎవరు తీసుకెళ్లారు, ఎక్కడికి తీసుకెళ్లారు అని ఆరా తీయగా ఆమె ఎలాంటి సమాచారం ఇవ్వలేదు. దాంతో మహిళ మానసిక పరిస్థితి సరిగా లేదని పోలీసులు గుర్తించారు. కిడ్నాప్ కేసు నమోదు చేసుకున్న పోలీసులు నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. మహిళపై అత్యాచారం చేసి వదిలేసి ఉండవచ్చని పోలీసులు అనుమానించి వైద్య పరీక్షలు నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. సీసీ కెమెరాల ఆధారంగా నిందితులను అరెస్టు చేసి విచారిస్తున్నట్లు సమాచారం. ఆ మహిళ కూకట్‌పల్లి ప్రాంతానికి చెందినది పోలీసులు గుర్తించారు. మానసికి స్థితి సరిగా లేని మహిళ గత కొన్ని రోజులుగా బస్ స్టాప్‌లలో ఉంటూ రోడ్లపై తిరుగుతున్నట్లు గుర్తించారు.

మసీద్‌ల వద్ద మౌలిక సదుపాయాలు కల్పించాలి



డిప్యూటీ మేయర్‌కి వినతి పత్రం అందజేస్తున్న ముస్లింలు

తార్నాక, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకొని తార్నాక డివిజన్ పరిధిలోని అన్ని మసీద్‌ల వద్ద మౌలిక సదుపాయాలు కల్పించాలని పలువురు ముస్లింలు శుక్రవారం జీహెచ్ఎంసీ డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతశోభన్ రెడ్డిని తార్నాకలోని క్యాంపు కార్యాలయంలో కలిసి వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా డిప్యూటీ మేయర్ మాట్లాడుతూ.. రంజాన్ పండుగను దృష్టిలో ఉంచుకొని తార్నాక డివిజన్ పరిధిలోని అన్ని మసీద్‌ల వద్ద ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ముస్లింల సమస్యలను పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన ఉండాలి



సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సీఐ శంకర్ నాయక్

అడ్డగుట్ట, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలకు బయపడాల్సిన అవసరం లేదని తుకారాంగేట్ పోలీస్ స్టేషన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శంకర్ నాయక్ తెలిపారు. శుక్రవారం తుకారాంగేట్‌లోని షిరిడీ సాయిబాబా హైస్కూల్‌లో విద్యార్థులకు సైబర్ నేరాలు, ఆన్‌లైన్ గేమ్‌లపై పోలీసులు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా సీఐ మాట్లాడుతూ.. మీకు తెలిసి.. తెలియకుండానే గుర్తు తెలియని వ్యక్తులు (సైబర్ నేరగాళ్లు) డిజిటల్ అరెస్టుల పేరుతో తల్లిదండ్రులకు ఫోన్ చేస్తే బయపడాల్సిన అవసరం లేదని, ఇలాంటి వ్యక్తులు ఫోన్ చేస్తే వెంటనే పోలీస్ కంట్రోల్ రూం 100కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలన్నారు. ముఖ్యంగా విద్యార్థులు ఆన్‌లైన్ గేమ్‌లకు దూరంగా ఉంటే మంచిదన్నారు. ఆన్‌లైన్ గేమ్‌లవల్ల డబ్బు పోగొట్టుకుంటారని, గుర్తుతెలియని వ్యక్తులు ఫోన్ చేసినా తల్లిదండ్రులకు సమాచారం ఇవ్వాలన్నారు. ఈ గేమ్‌ల వల్ల విద్యార్థులు నష్టపోతారన్నారు. ఏదో సులువుగా డబ్బు సంపాదించుకోచ్చన్న భ్రమతో విద్యార్థులు ఆన్‌లైన్ గేమ్‌లకు అలవాటు పడుతున్నారని, ఇలాంటి సైబర్ క్రైమ్‌లకు ఎంత దూరం ఉంటే అంత మంచిదన్నారు. కార్యక్రమంలో తుకారాగేట్ సబ్ ఇన్‌స్పెక్టర్ దయాకర్, స్కూల్ ప్రిన్సిపల్ శ్రీదర్ పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో సమాజ్‌వాదీ పార్టీ అభ్యర్థులను గెలిపించాలి

- పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ప్రొ. సింహాద్రి

తార్నాక, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర అభివృద్ధి, వెనకబడిన తరగతుల అభ్యున్నతికి ఎమ్మెల్సీ ఎన్నికల్లో సమాజ్‌వాదీ పార్టీ అభ్యర్థులకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ప్రొ. ఎస్.సింహాద్రి అన్నారు. శుక్రవారం తార్నాకలోని ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఉమ్మడి కరీంనగర్, మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్ గ్రాడ్యుయేట్ నియోజకవర్గ అభ్యర్థిగా డా. నిమ్మతోట వెంకటేశ్వర్లు, నల్లగొండ, వరంగల్, ఖమ్మం ఉపాధ్యాయ నియోజకవర్గ అభ్యర్థిగా ప్రొ. తాటికొండ వెంకట రాజయ్య సమాజ్‌వాదీ పార్టీ తరుపున పోటీ చేస్తున్నారని తెలిపారు. 30 సంవత్సరాలుగా సమాజ సేవలో చురుగ్గా పాల్గొంటున్న డా. నిమ్మతోట వెంకటేశ్వర్లును, ప్రొ. తాటికొండ వెంటరాజయ్యకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు.

సీడీఎంలో ముగిసిన 'డిస్కవర్ ఇండియా'



డిస్కవర్ ఇండియా కార్యక్రమంలో పాల్గొన్న విదేశీ ప్రతినిధులు

అల్వాల్, ఫిబ్రవరి 21 (ఆంధజ్యోతి): సికింద్రాబాద్‌లోని కాలేజ్ ఆఫ్ డిఫెన్స్ మేనేజ్‌మెంట్ (సీడీఎం)లో ఐదు రోజులుగా నిర్వహిస్తున్న డిస్కవర్ ఇండియా కార్యక్రమం శుక్రవారం ముగిసింది. సాంస్కృతిక అవగాహనను పెంపొందించడం, రక్షణ దౌత్యాన్ని మెరుగుపర్చడం ద్వారా అంతర్జాతీయ సహకారాన్ని బలోపేతం చేయడం ఈ కార్యక్రమం లక్ష్యం. రక్షణ దౌత్యం ద్వారా అంతర్జాతీయ సహకారాన్ని ప్రోత్సహించడానికి సీడీఎం 'డిస్కవర్ ఇండియా' కార్యక్రమం ద్వారా ప్రత్యేక చొరువ తీసుకుంటుందని అధికారులు పేర్కొన్నారు. ఇండోనేషియా, మలేషియా, బంగ్లాదేశ్, సౌదీ అరేబియా, మంగోలియా, కెన్యా, శ్రీలంక, ఉగాండా, నేపాల్, భూటాన్, బ్రెజిల్, మయన్మార్ దేశాలకు చెందిన 14 మంది ప్రతినిధులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఎటు చూసినా చెత్తే..

- ఆరోగ్య కేంద్రాలు, అంతర్గత రోడ్లు, విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద చెత్త
- జీహెచ్ఎంసీ అధికారులు అవగాహన కల్పిస్తున్నా మారని వైనం

ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాలు, అంతర్గత రోడ్లు, కాలువలు, విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్లు అనే తేడా లేకుండా ఎక్కడ పడితే అక్కడ చెత్త కుప్పలు దర్శన మిస్తున్నాయి. జీహెచ్ఎంసీ ఇంటింటికీ చెత్తను సేకరించడానికి ఆటో ట్రాలీలను నియమించింది. అయినప్పటికీ ఎక్కడపడితే అక్కడ చెత్త కుప్పలు దర్శనమిస్తున్నాయనడంలో సందేహంలేదు. కొందరు చెత్త ఇళ్ల నుంచి సేకరించడానికి ట్రాలీలు రెగ్యులర్‌గా రావడం లేదని చెబుతున్నారు. కారణాలేమైనప్పటికీ ప్రజారోగ్యాన్ని దెబ్బ తీసే విధంగా చెత్త కుప్పలు తయారవుతున్నాయి. రోజుకు రెండు మూడు సార్లు చెత్తను తరలించినప్పటికీ మళ్లీ చెత్త కుప్పలు కనిపిస్తూనే ఉంటాయి. కొందరు ఇంటింటికి వచ్చే ఆటో ట్రాలీలో చెత్తను వేయకుండా రోడ్లపైనే వేస్తున్నారని, జీహెచ్ఎంసీ పారిశుధ్య సిబ్బంది వాపోతున్నారు. కొన్ని ప్రదేశాల్లో ఇక్కడ చెత్త వేయరాదని, వేస్తే జరిమానా విధిస్తారని తెలియజేసే జీహెచ్ఎంసీ బ్యానర్లు ఏర్పాటు చేసినప్పటికీ చెత్తను రోడ్లపైనే వేస్తున్నారని తెలిపారు.



బోయగూడ ప్రభుత్వ ఆరోగ్య కేంద్రం వద్ద చెత్త కుప్పలు

పద్మారావునగర్, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): బోయగూడ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద చెత్త కుప్పలు పేరుకుపోయాయి. పారిశుధ్య సిబ్బంది సైతం వీధుల్లో సేకరించిన చెత్తను కొన్ని ప్రాంతాల్లో వేస్తూ, చెత్త డంపింగ్ కేంద్రాలుగా మారుస్తున్నారని, కొందరు గుర్తు తెలియని వ్యక్తులు రాత్రి వేళల్లో నిర్మాణ, ఇతర వ్యర్థాలను రోడ్లపై వేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.

మేకలమండి ఎదురు రోడ్డులో మురికి కాలువ మరమ్మతుల కారణంగా ఒకవైపు మట్టి కుప్పలుగా వేయడంతో పాటు మరో పక్క చెత్త కుప్పలతో రోడ్డు ఇరుకుగా మారి, వాహనదారులకు, పాదాచారులకు ఇబ్బందికరంగా మారిందని స్థానికులు తెలిపారు. చాచానెహ్రూనగర్ ప్రధాన రోడ్డులో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద చెత్త కుప్పలు ప్రమాదకరంగా మారాయి. జీహెచ్ఎంసీ సిబ్బంది చెత్త కుప్పలను తొలగించాలని, విద్యుత్ సిబ్బంది సహకారంతో ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద పోగైన చెత్తను వెంటనే తొగించి, అగ్ని ప్రమాదాలను నివారించాలని స్థానికులు కోరుతున్నారు.

బోయగూడ ప్రధాన దారిలోని బీఎస్ఎన్ఎల్ కార్యాలయం స్టెర్లింగ్ మెజెస్టిక్ అపార్టుమెంట్ మధ్యలోని దారిలో నిత్యం చెత్త కుప్పలు దర్శన మిస్తున్నాయి. పలు మార్లు గుర్తు తెలియని వ్యక్తులు చెత్తకు నిప్పంటించడంతో దట్టమైన పొగలు ఇళ్లలో వ్యాపించి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్లాస్టిక్ వ్యర్థాల కారణంగా వాతావరణం కలుషితమయ్యే ప్రమాదం లేకపోలేదని ఆవేదన స్థానికులు వ్యక్తం చేశారు.

చెత్తను తొలగించాలి



రోడ్లపై ఎక్కడ పడతే అక్కడ పోగైన చెత్త కుప్పలను తొలగించకపోవడంతో దోమలు వ్యాప్తిచెంది, ప్రజలు అనారోగ్యం భారిన పడతారని, చెత్త కుప్పల దుర్గంధం కారణంగా వాహనదారులు, పాదాచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఇప్పటికైనా పారిశుధ్య సిబ్బంది చెత్త కుప్పలను వెంటనే తొలగించాలి.

- మాచర్ల ప్రభాకర్, ఎమ్మార్పీఎస్ నాయకుడు, చాచానెహ్రూనగర్

సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి



బోయగూడ ప్రదాన దారి ఏషియన్ వైన్స్ సమీపంలోని బీఎస్ఎన్ఎల్ కార్యాలయం, స్టెర్లింగ్ మెజెస్టిక్ అపార్టుమెంట్ మధ్య ఉన్న కాలనీలోకి వెళ్లే దారిలో నిత్యం చెత్తకుప్పలు ఉంటున్నాయి. పద్మారావునగర్‌కు వెళ్లే వాహనదారులు, పాదాచారులు శార్ట్‌కట్ కారణంగా ఆ దారిని ఉపయోగిస్తుంటారు. జన సంచారం ఎక్కువగా లేకపోవడంతో మందుబాబులు, పోకిరీలకు అడ్డాగా మారుతోంది. వాహనాల రాకపోకలను నివారించడానికి బారికేడ్లు ఏర్పాటు చేయాలి. పౌరుల రక్షణార్థం ఆ దారిలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి.

- ఆర్. కృష్ణ ముదిరాజ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, పద్మారావునగర్



చాచానెహ్రూనగర్ రోడ్డులోని ట్రాన్స్‌పార్మర్ వద..



మేకలమండి ఎదురుగా ఉన్న రోడ్డులో వేసిన చెత్త



స్టెర్లింగ్ మెజెస్టిక్ అపార్టుమెంట్ వద్ద కాలుతున్న చెత్త కుప్పలు

27, 28 తేదీల్లో రాష్ట్రపతి నిలయంలో జాతీయ విజ్ఞాన దినోత్సవం

అల్వాల్, ఫిబ్రవరి21 (ఆంధజ్యోతి): జాతీయ విజ్ఞాన దినోత్సవం సందర్భంగా ఈనెల 27, 28వ తేదీల్లో సికింద్రాబాద్ బొల్లారం రాష్ట్రపతి నిలయంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని మేనేజర్ డాక్టర్ రజనీప్రియ తెలిపారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు నిర్వహించే ఈ కార్యక్రమంలో విజ్ఞాన ప్రదర్శనలతో పాటు వివిధ కార్యక్రమాలు ఉంటాయన్నారు. వైజ్ఞానిక ప్రదర్శనల వల్ల విద్యార్థులకు విజ్ఞానం, సాంకేతికతలో నూతన విషయాలను తెలుసుకోవడానికి అవకాశం ఉంటుందని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సెంటర్ ఫర్ డీఎన్ఏ ఫింగర్ ప్రింటింగ్ అండ్ డయాగ్నోస్టిక్స్(సీడీఎఫ్‌డీ), నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్(ఎన్ఆర్ఎస్‌సీ), సెంటర్ ఫర్ సెల్యూలర్ అండ్ మాలిక్యులర్ బయాలజీ(సీసీఎంబీ), సర్వే ఆఫ్ ఇండియా, టీ-హబ్, జన విజ్ఞాన వేదిక, నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ న్యూట్రిషన్ (ఎన్ఐఎన్), నేషనల్ జియోగ్రాఫికల్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ (ఎన్‌జీఆర్ఐ)సంస్థలు వాటి పరిశోధనలకు సంబంధించిన స్టాళ్లను ఏర్పాటు చేస్తున్నాయని తెలిపారు. నేషనల్ బుక్ ట్రస్ట్, జనవిజ్ఞాన వేదిక, డెక్కన్ హెరిటేజ్ అకాడమీ ట్రస్ట్‌లు విజ్ఞాన, సాంకేతికత వారసత్వానికి సంబంధించిన పుస్తక ప్రదర్శన కూడా ఉంటుందని మేనేజర్ డాక్టర్ రజనీప్రియ తెలిపారు. భారతదేశ సైంటిస్ట్‌లతో పాటు ప్రముఖ సైంటిస్ట్‌లు, అకడమిక్స్ విభిన్న ఆసక్తికర అంశాల నుద్దేశించి వర్క్‌షాప్‌లను నిర్వహిస్తారన్నారు. కార్యక్రమంలో భాగంగా క్విజ్, సైన్స్ మోడల్స్ ఎగ్జిబిషన్, పోస్టర్ మేకింగ్ వంటి పోటీలు కూడా ఏర్పాటు చేస్తారన్నారు. ఆసక్తిగల విద్యార్థులు https://rb.nic.in/Rbnilayam ద్వారా నమోదు చేసుకోవాలన్నారు. మరింత సమాచారం కోసం విజటర్ ఫెసిలిటేషన్ సెంటర్ రాష్ట్రపతి నిలయం 040-29560518లో సంప్రదించవచ్చన్నారు.



బొల్లారంలోని రాష్ట్రపతి నిలయం

'రేపటి స్వప్నం' కథల సంపుటి ఆవిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న గోపరాజు నారాయణరావు, శివప్రసాద్

చిక్కడపల్లి, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ మాతృభాషా దినోత్సవం సందర్భంగా కిన్నెర ఆర్ట్ థియేటర్స్ ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి త్యాగరాయగానసభలో ప్రముఖ రచయిత జన్నాభట్ల నరసింహ ప్రసాద్ రచించిన 'రేపటి స్వప్నం' కథల సంపుటి గ్రంథావిష్కరణ సభ జరిగింది. అధ్యక్షత వహించిన ప్రముఖ రచయిత ఆచార్య ముదిగొండ శివప్రసాద్ మాట్లాడుతూ సమాజానికి సందేశాన్నిచ్చే కథలు ఈసంపుటిలో ఉన్నాయన్నారు. సమస్యలను వివరించి వాటికి పరిష్కారాలను చూపడం నరసింహప్రసాద్ ప్రత్యేకత అన్నారు. పుస్తకాన్ని ప్రముఖ కథా రచయిత గోపరాజు నారాయణరావు ఆవిష్కరించారు. కార్యక్రమంలో కిన్నెర రఘురామ్, త్రోవగుంట వెంకట సుబ్రహ్మణ్యం, డా. అక్కిరాజు సుందరరామకృష్ణ, పొత్తూరి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు. సభకు ముందు భక్తిపాటలు ఆలాపన కార్యక్రమం జరిగింది.

మాతృభాషను కాపాడుకుందాం



అవార్డుగ్రహీతలతో సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ

చిక్కడపల్లి, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): మాతృభాషను కాపాడుకుందామని సీబీఐ మాజీ జేడీ వివి లక్ష్మీనారాయణ అన్నారు. త్యాగరాయగానసభలో శుక్రవారం పినాకిని యూత్ వెల్ఫేర్ అసోసియేషన్, కోటపాటి ఫౌండేషన్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం సందర్భంగా కవి సమ్మేళనం, తెలుగు భాషా అవార్డుల ప్రదానసభ జరిగింది. లక్ష్మీనారాయణ మాట్లాడుతూ పిల్లలు మాతృభాష ద్వారా నేర్చుకోవడం మొదలుపెట్టి మరో భాష నేర్చుకుంటే వారి విద్యాజీవితం సాఫీగా సాగుతుందన్నారు. సురేష్, భాస్కర్‌రావు, అంజయ్య, భాస్కర్, ప్రసాద్, రమాదేవి, లక్ష్మీ, ఝాన్సీ, ఆలియాబాను, పద్మావతి, సుహాసినిలను అవార్డులతో సత్కరించారు. మధుసూదన్, రాధాకుసుమ, మురళీమోహన్‌రాజు, మురళి, మహేశ్వరరావు, జయకుమార్, పూర్ణప్రసాద్, రమేష్ పాల్గొన్నారు.

డాక్టర్ అనన్య అంత్యక్రియలు పూర్తి



తిరుమలగిరి, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): కర్ణాటక రాష్ట్రం హంపిలో చనిపోయిన మైనంపల్లి హన్మంత రావు సమీప బంధువు డాక్టర్ అనన్య అంత్యక్రియలు తిరుమలగిరిలోని ఆర్టీసీ కాలనీ స్వర్గ వాటికలో శుక్రవారం నిర్వహించారు. మల్కాజ్‌గిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంత రావు, మెదక్ ఎమ్మెల్యే రోహిత్ పాల్గొన్నారు. కొంపల్లిలోని తన నివాసంలో కార్యక్రమాలు నిర్వహించి, అనంతరం తిరుమలగిరిలోని స్వర్గదాంలో హన్మంతరావు ఆధ్వర్యంలో దహన సంస్కారాలు నిర్వహించారు.

రైలు నుంచి జారీ పడి వ్యక్తి మృతి



సికింద్రాబాద్ రైల్వేస్టేషన్, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): రైలులో ప్రయాణిస్తున్న ఓ వ్యక్తి ప్రమాదశాత్తు రైలు నుంచి జారీ కిందపడి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటన మౌలాలి రైల్వేస్టేషన్ సమీపంలో జరిగింది. సికింద్రాబాద్ రైల్వే హెడ్ కానిస్టేబుల్ డేవిడ్ రాజు తెలిపిన వివరాల ప్రకారం... మౌలాలి రైల్వే స్టేషన్ బీ క్యాబిన్ వద్ద గుర్తుతెలియని వ్యక్తి(45) శుక్రవారం సికింద్రాబాద్ వెళ్లే ఎక్స్‌ప్రెస్ రైలులో ప్రయాణిస్తుండగా మౌలాలి వద్దకు రాగానే ప్రమాదవశాత్తు రైలు నుంచి జారీపడి కింద పడడంతో రెండు కాళ్లు కోల్పోయి తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు. వ్యక్తి ఆచూకీ తెలిస్తే 9440083160 నంబరుకు సమాచారం ఇవ్వాలని రైల్వే పోలీసులు కోరారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రజా కళాకారుడు నాజర్‌కు నివాళి

చిక్కడపల్లి, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): తన గంభీర గళంతో వేలాది శ్రోతలను ముగ్దులను చేసి ప్రజలను చైతన్యపర్చిన అద్భుత బుర్రకథ కళాకారుడు షేక్ నాజర్ ప్రజా కళాకారుడు అని హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ కాశీవిశ్వేశ్వరరావు అన్నారు. త్యాగరాయగానసభ ఆధ్వర్యంలో ఎందరో మహానుభావులు మధుర స్మృతుల పరంపరలో భాగంగా నాజర్‌యాదిలో సంస్మరణ సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న జస్టిస్ కాశీవిశ్వేశ్వరరావు మాట్లాడుతూ గుంటూరు జిల్లాలో కుగ్రామంలో నిరుపేద కుటుంబంలో జన్మించిన నాజర్‌కు మంచి స్వరం వరంగా వచ్చింది అన్నారు. ఆయన తొలి రోజుల్లో భిక్షాటన కూలి పనులకు వెళ్లి సంగీతంలో శిక్షణ పొందారు అన్నారు. సాహితీకిరణం సంపాదకుడు పొత్తూరి సుబ్బారావు మాట్లాడుతూ హేతువాది అయిన నాజర్‌కు కమ్యూనిస్టు పార్టీ ప్రజానాట్య మండలి వేదికలు ఏర్పాటుచేసి ఆయన బుర్ర కథలకు ప్రాచుర్యం కల్పించారన్నారు. కొన్ని సినిమాల్లో నటించి బుర్రకథ చెప్పినా అక్కడి వాతావరణం నచ్చక తిరిగి తన రంగస్థల కళను నమ్ముకున్నారన్నారు. గానసభ అధ్యక్షుడు కళా జనార్దనమూర్తి మాట్లాడుతూ నాజర్‌కు కేంద్రప్రభుత్వం పద్మశ్రీతో సత్కరించి ఆయనపై తమ గౌరవం ప్రకటించారన్నారు.

చైన్ స్నాచర్ అరెస్ట్

పంజాగుట్ట, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): మహిళ మెడలో నుంచి బంగారు గొలుసు అపహరించిన ఘటనలో పంజాగుట్ట పోలీసులు చైన్ స్నాచర్‌తో పాటు రిసీవర్‌ను అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి 12 గ్రాముల బంగారు గొలుసు, ద్విచక్రవాహనం, రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బేగంపేట కుందన్‌బాగ్‌కు చెందిన జి.వరలక్ష్మి ఓ వ్యాపార సముదాయంలో హౌస్ కీపింగ్ విభాగంలో పనిచేస్తోంది. ఈ నెల 19న ఉదయం విధులకు వెళ్తుండగా వెనుక నుంచి ద్విచక్రవాహనంపై వచ్చిన అగంతకుడు ఆమె మెడలో ఉన్న 12గ్రాముల బంగారు గొలుసును లాక్కొని పారిపోయాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పంజాగుట్ట పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు. సీసీ ఫుటేజీ, సాంకేతిక ఆధారాలతో అబిడ్స్ రాంకోఠి ప్రాంతానికి చెందిన కాల్ సెంటర్ ఉద్యోగి అయిన చైన్‌స్నాచర్ మాథ్యూరాజ్ జాసన్(22)తో పాటు చంపాపేటకు చెందిన నగల దుకాణం నిర్వాహకుడు కవాడియా అన్‌రాజ్ ప్రజాపథ్(40)ను శుక్రవారం అరెస్టు చేశారు.

తుకారాంగేట్‌లో అధికారుల పర్యటన



గడ్డమీదిబస్తీలో పర్యటించిన జలమండలి ఎలక్ట్రికల్ మేనేజర్ శ్రీనివాస్, బీజేపీ నేతలు

అడ్డగుట్ట, ఫిబ్రవరి 21 (అంధ్రజ్యోతి): సింటెక్స్ ట్యాంక్‌లు అందుబాటులోకి వచ్చేదెన్నడో? అనే శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితం కావడంతో మారేడుపల్లి జలమండలి ఎలక్ట్రికల్ విభాగం మేనేజర్ శ్రీనివాస్ స్పందించారు. తుకారాంగేట్‌లో శిథిలమైన సింటెక్స్ ట్యాంక్‌ల పరిస్థితిని తెలుసుకునేందుకు అధికారులు రంగంలోకి దిగారు. తుకారాంగేట్ ఏరియాలోని ఐదు బోర్లు చేతి పంపులు శిథిలావస్థకు చేరడంతో 9 సింటెక్స్ ట్యాంకులకు పవర్ సప్లై లేక పనిచేయడం లేదు. ఎక్కడ పొరపాటు జరిగిందనే విషయాలపై బస్తీవాసులను అడిగి తెలుసుకున్నారు. మొత్తం 15 బోర్లను పరిశీలించగా 15బోర్లు పనిచేయకపోవడంతో బస్తీ పేర్లు, ఇంటి నెంబర్ల వివరాలను అధికారులు సేకరించామని వాటర్ వర్క్స్ జీఎంకు లేఖ రాస్తున్నట్టు మేనేజర్ శ్రీనివాస్ తెలిపారు. అధికారుల వెంట బీజేపీ నాయకులు హంసరాజు, శివకుమార్ ఉన్నారు.

కిషన్ రెడ్డి నుంచి సిఫారసు చేయిస్తాం

సికింద్రాబాద్ నియోజకవర్గం అడ్డగుట్ట డివిజన్‌లో దాదాపు 15 పవర్ బోర్లు 5 చేతి పంపులు పనిచేయడంలేదనే కోణంలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి అక్కడి నుంచి లేఖ రాయించుకొని జలమండలి జీఎంకు ఇస్తాం. దాదాపు రెండేళ్ల నుంచి పవర్ బోర్లు, చేతి పంపులు పాడైపోయి ప్రజలు ఇబ్బందులు పడుతుంటే కార్పొరేటర్ ప్రసన్నలక్ష్మి పట్టించుకోకపోవడంవల్ల పవర్ బోర్లు, చేతి పంపులు అడుగంటిపోయాయి. స్థానికుల ఫిర్యాదులను స్వీకరించి బాగు చేస్తే ఎండా కాలంలో ప్రజలు ఇబ్బందులు పడేవారు కాదు.

- హంసరాజు, బీజేపీ, సీనియర్ నాయకుడు

అవుట్‌గేట్ వద్ద మళ్లీ సిమెంట్ దిమ్మెలు ఏర్పాటు

రెజిమెంటల్‌బజార్, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ అవుట్ గేట్ నుంచి బయటకొచ్చే రైలు ప్రయాణికుల సౌకర్యం కోసం తొలగించిన సిమెంట్ దిమ్మెల్లో కొన్నింటిని మళ్లీ ఏర్పాటు చేశారు. సిమెంట్ దిమ్మెలు తొలిగించడంతో ఆటోలు లోపలికి నేరుగా అవుట్ గేట్ ద్వారా వెళ్తుండడంతో ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోందని మహంకాళి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ఉపశంకర్ తెలిపారు. ఆటోలను కట్టడి చేయడానికి కొంత మేర మళ్లీ సిమెంట్ దిమ్మెలను శుక్రవారం ఏర్పాటు చేసినట్టు తెలిపారు. వీటి ఏర్పాటువల్ల మోండా మార్కెట్ వైపు వెళ్లే వాహనదారులకు ఎలాంటి ఆటంకం ఉండదని ఇన్‌స్పెక్టర్ తెలిపారు. గతంలో సిమెంట్ దిమ్మెలు తొలిగించడంవల్ల ఉపాధి కోల్పోయిన స్ట్రీట్ వ్యాపారులకు రైల్వే పార్శిల్ కార్యాలయం వైపు వెళ్లే దారిలో ఇరువైపులా రెండు నుంచి మూడు ఫీట్ల స్థలం కేటాయింపుపై పరిశీలిస్తున్నట్టు సమాచారం.



సిమెంట్ దిమ్మెల ఏర్పాటును పరిశీలిస్తున్న ఇన్‌స్పెక్టర్ ఉపశంకర్, ఎస్సై మహేష్

ట్రాన్స్‌ఫార్మర్‌ను తొలగించండి

అడ్డగుట్ట, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): తుకారాంగేట్ రియో పాయింట్ హోటల్ ఎదురుగా అంగన్‌వాడీ స్కూల్ పక్కనే ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను తొలగించాలని అడ్డగుట్ట బీజేపీ సీనియర్ నాయకులు శివకుమార్, గోగుల స్వామి ఆధ్వర్యంలో శుక్రవారం లాలాగూడ ఏఈకి వినతిపత్రం అందజేశారు. అంగన్‌వాడీ స్కూల్‌కు వస్తున్న చిన్నారులు ట్రాన్స్‌ఫార్మర్‌కు అగ్గిరాసుకుంటున్న మంటలను చూసి బయటపడుతున్నారని, స్కూల్‌కు అడ్డంగా ఉందని ఏఈ దృష్టికి తీసుకొచ్చారు. వెంటనే ఈ స్కూల్ పక్కనే ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను తొలగించాలని కోరారు. ఈ విషయంలో గతంలో పలుమార్లు లాలాగూడ విద్యుత్ కార్యాలయంలో ఫిర్యాదు చేశామని, ఎవరూ పట్టించుకోలేదన్నారు. అంగన్‌వాడీ స్కూల్ నుంచి తొలగించి పక్కనే ఉన్న గార్డెన్‌లోకి మార్చాలని కోరారు.



లాలాగూడ ఏఈకి వినతి పత్రం అందజేస్తున్న బీజేపీ నాయకుడు శివకుమార్